క్లుప్తంగా

తరగతులు ప్రారంభించాలి

నర్సంపేట: నర్సంపేటలో వైద్య కళాశాలకు అనుసంధానంగా మంజూరైన నర్సింగ్ కళాశాలలో ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభించాలని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైద్య, నర్సింగ్ కళాశాలల పెండింగ్ పనులను సత్వరమే పూర్తిచేయాలని కోరారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు సహకారంతోనే నర్సంపేటకు వైద్య కళాశాల మంజూరైందని తెలిపారు. మెడికల్, నర్సింగ్ కాలేజీలతో వైద్య రంగంలో నర్సంపేటకు గుర్తింపు వస్తుందని పేర్కొన్నారు. వంద సీట్లతో వైద్య కళాశాల మంజూరు కాగా 50 సీట్లకు కుదించడం బాధాకరం అన్నారు. కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, బోధన, బోధనేతర సిబ్బందిని నియమించాలని చెప్పారు.

నర్సంపేట అభివృద్ధికి కృషి



నర్సంపేట: నర్సంపేట పట్టణ అభివృద్ధికి కృషి చేయనున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ గుంటి రజని అన్నారు. ఈ మేరకు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయక నిమజ్జనం, బతుకమ్మ, దసరా ఉత్సవాల నిర్వహణ కోసం రూ.24.89 లక్షలు, ఆస్తి పన్నుల వసూలు కోసం ఐదు హ్యాండ్ హెల్త్ మిషన్స్ కొనుగోలు, తైబజారు, సీల్డ్ టెండర్ కొటేషన్ నిర్ణయం తీసుకోవడంతోపాటు 15అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పట్టణాభివృద్ధిలో భాగస్వాములవుతూ ఆదర్శంగా తీర్చిదిద్దుకుందామన్నారు. మున్సిపల్ కమిషనర్ ఈసంపల్లి జోనా, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు మొండ్రాయి విద్యార్థులు

సంగెం: రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు మొండ్రాయి పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు విజయ, పీడీ ముఖర్జీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10న వరంగల్ ఓసిటీ గ్రౌండ్స్‌లో జరిగిన జిల్లాస్థాయి జూనియర్స్ పోటీల్లో ప్రతిభ కనబరిచి, ఈనెల 14 నుంచి 18 వరకు నిర్మల్‌లో జరగనున్న ఐదో రాష్ట్రస్థాయి జూనియర్స్ బేస్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. పదో తరగతి నుంచి ఎస్.సాయి చరణ్, తొమ్మిదో తరగతి నుంచి బి.విష్ణువర్ధన్, సీహెచ్.తేజ, దీపిక, వైష్ణవి పోటీల్లో పాల్గొంటున్నారని తెలిపారు. విద్యార్థులను గురువారం అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ అనుముల శ్రీలత ఉపాధ్యాయులు అభినందించారు.

రూ.10వేల కోట్లు విడుదల చేయాలి

నర్సంపేట: కేంద్ర ప్రభుత్వం వరద సహాయ నిధికి రూ.10వేల కోట్లు విడుదల చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలో పిట్టల సతీశ్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రమేశ్, మండల కార్యదర్శి యాకయ్య, కవిత, నాయకులు నాగరాజు, యాదగిరి, మమత పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



నర్సంపేట: నర్సంపేట మున్సిపాలిటీలో అనేక సంవత్సరాలుగా పని చేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీటీయూ జిల్లా నాయకుడు హన్మకొండ శ్రీధర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పని చేస్తున్న సమయంలో ప్రమాదాలు జరిగిన కార్మికులకు ఉద్యోగ భద్రత, ఆర్థిక సాయం చేయాలని అందుకు మున్సిపాలిటీలో తీర్మానం చేయించాలని మున్సిపాలిటీ కార్మికుల(సీఐటీయూ) ఆధ్వర్యంలో గురువారం నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి వినతిపత్రం అందజేశారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

నర్సంపేట: బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలని కైలాష్ సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్, షేర్ స్వచ్ఛంద సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ టి.శిరీష అన్నారు. ఈ మేరకు పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు పి.కాంతారావు అధ్యక్షతన గురువారం బాల్య వివాహాలు, బాల కార్మికులు, బాలలపై లైంగిక వేధింపులు, బాలల అక్రమ రవాణాపై అవగాహన సదస్సు నిర్వహించి వాల్‌పోస్టర్లు పత్రికలను ఆవిష్కరించారు. అరుణకుమారి, వాణి, ఉపాధ్యాయులు, కమ్యూనిటీ మొబిలైజర్స్ ప్రశాంతి, కల్పన పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

నెక్కొండ: మహిళలు పొదుపు సంఘాల ద్వారా ఆర్థికంగా ఎదగాలని టీపీసీసీ సభ్యుడు రంజిత్ రెడ్డి అన్నారు. దీక్షకుంటలో గురువారం గణేశ్ గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

గ్రామసింహాల గర్జన

బెంబేలెత్తుతున్న ప్రజలు

- మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో గుంపులుగా స్వైరవిహారం
- నిత్యం కుక్కకాటుకు గురవుతున్న ప్రజలు, పశువులు
- వాహనాల వెంటబడుతున్న కుక్కలు
- నియంత్రణ చర్యలు చేపట్టాలని జనం వేడుకోలు



సంగెంలో అంగన్‌వాడీకి వెళ్లే చిన్నారిపై దాడికి వెళ్తున్న కుక్కలు

సంగెం: గ్రామాల్లోని వీధిలో ఓ కుక్క ఉందంటే ఏ దొంగ భయం ఉండదని ప్రజల విశ్వాసం.. కానీ, అవే కుక్కలు స్థానికులను సైతం భయాందోళనకు గురిచేస్తుండడంతో వామ్మో.. కుక్కలు అంటూ ప్రజలు వాపోతున్నారు. మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో కుక్కల బెడద అధికమైంది. ఏ వాడలో చూసినా కుక్కలు గుంపులుగా చేరి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. బాటసారులు, వాహనచోదకులపైకి ఎగబడి గాయపరుస్తున్నాయి. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వారానికి కనీసం మూడునాలుగు కుక్కకాటు కేసులు నమోదు అవుతున్నాయి. కొందరు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మనుషులతోపాటుగా పాడిపాశువులపై కుక్కల దాడి పెరిగిపోయింది. ఈ పరిస్థితుల్లో బయటకు రావాలంటే పిల్లలు, వృద్ధులు వణికిపోతున్నారు. గతంలో జీపీల ఆధ్వర్యంలో కుక్కల నియంత్రణ చర్యలు తీసుకునేవారు. ఐదారేళ్లుగా కుక్కల నియంత్రణకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో కుక్కల సంఖ్య విపరీతంగా పెరిపోయింది. కుక్కల బెడదను నియంత్రించాలని చెప్పినా ఎవరూ పట్టించుకోవడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. కుక్కలను చంపడం నేరమని జంతు ప్రేమికులు అధికారులపై కేసులు వేస్తుండడంతో వాటిని నియంత్రించే చర్యలు తీసుకోవడంపై వెనుకంజ వేస్తుండడంతో కుక్కలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ చక్కర్లు కొడుతున్న కుక్కలు ఆఫీసులకు వివిధ అవసరాలపై వచ్చే జనాలపై దాడి చేస్తుండడంతో జనాలు జంకుతున్నారు. కుక్కలను చంపకుండా వాటి జనన నియంత్రణకు ఆపరేషన్లు చేయాలని పలువురు కోరుతున్నారు.



సంగెంలో పోలీస్‌స్టేషన్ వద్ద కుక్కల గుంపు

ఇబ్బందులు తప్పడంలేదు



రోజురోజుకు కుక్కల బెడద ఎక్కువుతుంది. పగలు రాత్రి తేడా లేకుండా రోడ్లపై గుంపులుగా చేరి దారి వెంట వచ్చి వెళ్లే వారిని భయాందోళనకు గురిచేస్తూ గాయపరుస్తున్నాయి. ఇంట్లోంచి బయటకు రావాలంటే భయంగా ఉంటుంది. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– దివ్య, సంగెం

చిన్నారులను కరుస్తున్నాయి..



చిన్నారులపై కుక్కలు దాడి చేస్తున్నాయి. ఇటీవల పాఠశాల నుంచి తిరిగి వస్తున్న మా కుమారుడిపై నాలుగు కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. గ్రామస్తులు అడ్డుకోకుంటే మా కుమారుడు మాకు దక్కేవాడు కాదు. కుక్కలను నియంత్రించి ప్రజల ప్రాణాలు కాపాడాలి.

–వేల్పుల సునంద, రామచంద్రాపురం

డీపీఓకు లేఖ రాశాం



మండలంలో కుక్కల బెడదపై ఫిర్యాదులు వస్తున్నాయి. కుక్కలను చంపాలని ఆదేశాలు లేవు. కుక్కలకు సంతానం కలుగకుండా ఆపరేషన్లు చేయించడానికి వెటర్నరీ వైద్యుడిని సంప్రదించాం. నిధులు మంజూరుకోసం డీపీఓకు లేఖ రాశాం. నిధులు వస్తే ఆపరేషన్లు చేయించి నియంత్రణ చర్యలు చేపడతాం.

– కొమురయ్య, ఎంపీఓ సంగెం

కొనసాగుతున్న గణపతి ఉత్సవాలు



నర్సంపేట: ఒకటో డివిజన్‌లో భక్తుల పూజలు..



చెన్నారావుపేట: నిమజ్జనం కోసం కోపాకుల చెరువును పరిశీలిస్తున్న అధికారులు

జిల్లా వ్యాప్తంగా గణపతి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతోన్నాయి. వాడవాడలా మండపాల్లో ప్రతిష్ఠించిన విగ్రహాల వద్ద నిర్వాహకుల ఆధ్వర్యంలో ఉదయం సాయంత్రం పూజలు నిర్వహిస్తున్నారు. అన్నదాన కార్యక్రమాలు చేపట్టి ప్రసాద వితరణ చేస్తున్నారు. పలుచోట్ల రాజకీయ నాయకులు, తదితరులు పూజల్లో పాల్గొంటున్నారు. ఇక మరోవైపు నవరాత్రి ఉత్సవాల అనంతరం నిర్వహించే వినాయక విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. అందులో భాగంగా సమీపంలోని చెరువులు, కుంటలను పరిశీలిస్తున్నారు. - సాక్షి నెట్‌వర్క్

గ్రామీణ వైద్యులపై దాడులు ఆపాలి

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ప్రాథమిక చికిత్సలు అందిస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీలపై టీఎస్ఎంసీ, ఏఎంఏ దాడులను ఆపాలని ఆర్ఎంపీలు, పీఎంపీలు కోరారు. తమపై దాడులకు నిరసనగా గురువారం పలు మండలాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తమ సమస్యలను వివరిస్తూ తహసీల్దార్లు, ఎంపీడీఓలకు వినతి పత్రాలు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో రేయింబవళ్లు ఎప్పుడు అనారోగ్య సమస్య వచ్చినా ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్యం చేస్తున్నామన్నారు.

- సాక్షి నెట్‌వర్క్



గీసుకొండ: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీలు



పర్వతగిరి: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తూ..

విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకోవాలి

చెన్నారావుపేట/ఖానాపురం: విద్యార్థులు గొప్పవ్యక్తుల స్ఫూర్తితో ఉన్నతస్థాయికి చేరుకోవాలని జేడీ ఫౌండేషన్ తెలంగాణ స్టేట్ కన్వీనర్ పింగిలి కవితారెడ్డి అన్నారు. చెన్నారావుపేట మండల కేంద్రంలోని హైస్కూల్ విద్యార్థులకు, ఖానాపురం మండలంలోని దబ్బీర్‌పేట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు జేడీ ఫౌండేషన్, హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో గురువారం టీ షర్ట్‌లను పంపిణీ చేశారు. చెన్నారావుపేట హెచ్ఎం పాపమ్మ, హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజర్స్ మోతె ఇంద్రసేనారెడ్డి, కృష్ణమూర్తి, ననుమాస కర్ణాకర్, రాజేంద్రప్రసాద్, రాజేందర్, పెండెం భాస్కర్, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం, పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు ఈదునూరి రవీందర్‌రెడ్డి, దబ్బీర్‌పేట పాఠశాల హెచ్ఎం వెంకట్రాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చెన్నారావుపేట పాఠశాలలో టీ షర్ట్‌లు పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ బాధ్యులు

ఏచూరి మృతి వామపక్ష ఉద్యమాలకు తీరని లోటు



ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నర్సంపేట: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి దేశ కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సమ్మయ్య, కొరబోయిన కుమారస్వామి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎర్ర యాకుబ్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు పట్టణంలోని వరంగల్ రోడ్డు కూడలి వద్ద గురువారం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఎం పట్టణ కార్యదర్శి హన్మకొండ శ్రీధర్ అధ్యక్షతన సంతాప సమావేశంలో మాట్లాడుతూ సీతారాం ఏచూరి మార్క్సిస్టు భావజాలానికి బద్ధుడై సీపీఎం జాతీయ కార్యదర్శిగా ఎదిగిన వ్యక్తి అని కొనియాడారు. శ్రీనివాస్‌రెడ్డి, ఆంజనేయులు, రవి, బాలకృష్ణ, రాజు, సంజీవ, బాబురావు, దాసరి నరేశ్, తోటకూరి రాజేశ్, విజయ తదితరులు పాల్గొన్నారు. సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి వామపక్ష సామాజిక ఉద్యమాలకు తీరని లోటని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ అన్నారు. ఈ మేరకు నర్సంపేట పార్టీ కార్యాలయంలో గురువారం ఏచూరి మృతికి నివాళులర్పించారు.

ఆర్‌సీఓను కలిసిన నాయకులు

వర్ధన్నపేట: మహాత్మాజ్యోతిరావు పూలే బీసీ గురుకులాల పాఠశాలల జిల్లా ప్రాంతీయ అధికారి రాజ్‌కుమార్ నూతనంగా బాధ్యతలు చేపట్టారు. గురువారం కార్యాలయంలో ఆయనను జాతీయ యువజన అవార్డు గ్రహీత జక్కి శ్రీకాంత్, తెలంగాణ అంబేడ్కర్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

పొదుపు సంఘంలో అక్రమాలు

- గుండ్లపహాడ్‌లో ఆలస్యంగా వెలుగులోకి..
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- కానరాని రికార్డుల నిర్వహణ



సంఘం సభ్యులతో చర్చిస్తున్న మదర్ థెరిస్సా మండల సమాఖ్య పాలకవర్గం

నల్లబెల్లి: మండలంలోని గుండ్లపహాడ్ రాజరాజేశ్వర మహిళా పొదుపు సంఘంలో గురువారం అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. రాజరాజేశ్వర మహిళా పొదుపు సంఘాన్ని 13మంది సభ్యులతో ఏర్పాటు చేశారు. ఈ సంఘానికి 2022లో నర్సంపేట యూనియన్ బ్యాంకు అధికారులు రూ.10లక్షల రుణం మంజూరు చేశారు. 2021లో అనారోగ్యంతో సభ్యురాలు పడాల భాగ్యలక్ష్మి మృతిచెందింది. 2022లో అధికారులు ఆమె పేరుతో రుణం ఇచ్చారని గ్రామంలో చర్చ జరుగుతోంది. బ్యాంకు అధికారులు నిబంధనలు పట్టించుకోకుండా, పత్రాలు, రికార్డులు పరిశీలించకుండా వారం రోజుల క్రితం ఇదే సంఘానికి రూ.20 లక్షల రుణం ఇచ్చారు. అంతేకాకుండా నలుగురు సభ్యుల పేర్లతో రూ.20 లక్షల రుణం తీసుకోగా.. నిబంధనలకు విరుద్ధంగా 12 మంది సభ్యులకు అప్పులు ఇచ్చారు. రెండేళ్ల క్రితమే ఓ సభ్యురాలు సరళను తొలగించారని అప్పు ఇవ్వడానికి నిరాకరించారు. కానీ, ఆమె నుంచి గత నెల వరకు పొదుపు డబ్బులు తీసుకున్నారు. సంఘం నుంచి తొలగించిన పొదుపు డబ్బులు ఎందుకు తీసుకున్నారని ఐకేపీ అధికారులను నిలదీస్తే దాటవేస్తున్నారు. రాజరాజేశ్వరి పొదుపు సంఘంతోపాటు మండలంలోని పలు సంఘాల్లో రికార్డుల నిర్వహణ సక్రమంగా లేదనే ఆరోపణలున్నాయి.

అక్రమాలు వాస్తవమే..



గుండ్లపహాడ్ రాజరాజేశ్వర మహిళ పొదుపు సంఘంలో అక్రమాలు జరిగింది వాస్తవమే. ఈ సంఘంలో 60 ఏళ్లు పైబడినవారు, స్థానికంగా లేని వారు సభ్యులుగా ఉన్నారు. 2022 సంవత్సరంలో మృతి చెందిన సభ్యురాలికి అప్పు ఇచ్చిన విషయం నా దృష్టికి రాలేదు. సభ్యులు అప్పుడు తీసుకున్న రుణాన్ని బ్యాంకుకు పూర్తి స్థాయిలో చెల్లించారు. రికార్డుల నిర్వహణ లేని విషయాన్ని గుర్తించాం. అన్ని సంఘాల్లో రికార్డులను పూర్తి స్థాయిలో పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటాం.

– సునీత, ఏపీఎం, నల్లబెల్లి

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న నెల్లుట్ల సుమన్

నర్సంపేట: యువత, విద్యార్థులు మాదకద్రవ్యాలు, డ్రగ్స్, కొకైన్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తెలంగాణ సాంస్కృతిక సారధి నర్సంపేట టీం లీడర్ నెల్లుట్ల సుమన్ సూచించారు. ఈ మేరకు పట్టణంలో పట్టణంలో గురువారం ఆటపాటల ద్వారా మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. కళాకారులు తాళ్ల సునిల్ యోచన, రాజేందర్, రవీందర్, శ్రావణ్, అవినాశ్, సురేందర్, రాజు, నవీన్, రాజేశ్, భాస్కర్ పాల్గొన్నారు.

ఎప్పుడొస్తారో తెలియదు

- సమయపాలన పాటించని వైద్యులు, సిబ్బంది
- పీహెచ్‌సీలో నిరీక్షిస్తున్న బాధితులు

రాయపర్తి: ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని ఉన్నతాధికారులు చెబుతున్నా.. వైద్యాధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. మండలకేంద్రంలోని పీహెచ్‌సీలో పని చేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది ఎప్పుడు వస్తున్నారో ఎప్పుడు వెళ్తున్నారో.. తెలియక చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చే రోగులు ఆయోమయానికి గురవుతున్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి పలువురు బాధితులు చికిత్స కోసం వచ్చారు. కానీ, ఉదయం 11గంటలు దాటినా వైద్యులు మాత్రం రాకపోవడంతో వారికి నిరీక్షణ తప్పలేదు. సీజనల్ వ్యాధులతో జనాలు ఇబ్బందులు పడుతున్న కాలంలో సైతం సరైన సమయానికి వైద్యులు రాకపోవడం గమనార్హం. ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని వైద్యాధికారులు అందుబాటులో సేవలందించాలని గురువారం ఆస్పత్రికి వచ్చిన వివిధ గ్రామాల ప్రజలు.. మూనావత్ లక్ష్మణ్‌నాయక్, మాన్యానాయక్, బొమ్మెర యాదగిరి, బొమ్మెర సరోజన, గారె కనకయ్య, వేల్పుల మల్లమ్మ డిమాండ్ చేశారు.



ఖాళీగా ఉన్న వైద్యాధికారి కుర్చీ



పీహెచ్‌సీ ఎదుట వేచిఉన్న బాధితులు

మిత్రుల ఔదార్యం

దుగ్గొండి: మండలంలోని నాచినపల్లి గ్రామానికి చెందిన యాట విజయ అనారోగ్యంతో మృతి చెందింది. ఈ మేరకు ఆమె కుమారుడు శ్రీను, కూతురు సుమలతల టెన్త్ బ్యాచ్ మిత్రులంతా(2003–04) కలిసి రూ.19,000 బాధిత కుటుంబానికి అందించారు. కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని ధైర్యం చెప్పారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

చెన్నారావుపేట: అక్కల్‌చెడ శివారు కట్టయ్యపల్లి గ్రామానికి చెందిన బొంత కొంరయ్య (63) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. కాగా, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్ తదితరులు.. కొంరయ్య మృతదేహంపై పూలమాలవేసి నివాళులర్పించారు. నన్నెబోయిన రమేశ్, రాజేందర్, తదితరులు ఉన్నారు.

నేడు ముసాయిదా ఓటరు జాబితా విడుదల

వర్ధన్నపేట: తెలంగాణ గ్రామ పంచాయతీ 2వ సాధారణ ఎన్నికలు 2024 కోసం నేడు(శుక్రవారం) గ్రామ పంచాయతీ వార్డుల వారీగా ముసాయిదా జాబితా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రచురించనున్నట్లు వర్ధన్నపేట ఎంపీడీఓ వెంకటరమణ తెలిపారు. ఓటర్లు తమ వివరాలు సరిచూసుకోవాలని సూచించారు.

తహసీల్దార్‌ను కలిసిన ఎస్సై రాజేశ్‌రెడ్డి

చెన్నారావుపేట: ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎస్సై రాజేశ్‌రెడ్డి గురువారం తహసీల్దార్ ఫణికుమార్, ఎంపీడీఓ శ్రీవాణిలను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి మొక్కలు అందించారు. ఎంపీఓ శ్రీధర్‌రాజు ఉన్నారు.

మండల ప్రత్యేక అధికారిగా నీరజ

పర్వతగిరి: పర్వతగిరి మండల ప్రత్యేక అధికారిగా జిల్లా కో ఆపరేటివ్ అధికారి ఎం.నీరజ బాధ్యతలు చేపట్టారు. గతంలో మండల ప్రత్యేక అధికారిగా పని చేసిన జిల్లా కో ఆపరేటివ్ అధికారి బి.సంజీవరెడ్డి బదిలీ కావడంతో ఆయన స్థానంలో నీరజ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నీరజను పుష్పగుచ్ఛం అందజేసి ఆహ్వానించారు. ఎంపీడీఓ శంకర్‌నాయక్, ఎంపీఓ శ్రీనివాస్, డివిజనల్ పంచాయతీ అధికారిణి, కార్యాలయ పర్యవేక్షకులు రూపేశ్, రాజు, పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

పర్వతగిరి: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని చింతనెక్కొండలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఏడెల్లి రాజు (40) మూడు నెలల నుంచి కడుపునొప్పితో ఇబ్బంది పడుతున్నాడు. పలుమార్లు ఆస్పత్రులకు వెళ్లినా తగ్గలేదు. ఈ క్రమంలో ఈనెల 6వ తేదీన గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందాడు. రాజు భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వివాహిత అదృశ్యం



సరిత

గీసుకొండ: మండలంలోని బొడ్డుచింతలపెల్లికి చెందిన వివాహిత బోల్లపల్లి సరిత ఆగస్టు 24న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదని ఆమె భర్త గురువారం గీసుకొండ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తనతో గొడవ పడి వెళ్లిపోగా బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికినా ప్రయోజనం లేదని, ఆచూకీ తెలపాలని భర్త బాల కొమురయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని సీఐ బాబూలాల్ తెలిపారు.

నందిగామలో వైద్యశిబిరం

నల్లబెల్లి: మండలంలోని నందిగామలో నల్లబెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 55 మందికి డాక్టర్ శృతి వైద్య పరీక్షలు చేశారు. డెంగీ, మలేరియా లక్షణాలతో బాధపడుతున్న 14 మందికి పరీక్షలు నిర్వహించారు. హెల్త్ అసిస్టెంట్ సాంబమూర్తి, ఏఎన్ఎం అన్నమ్మ, పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ట్రాన్స్‌కో ఉద్యోగుల నిరసన

రాయపర్తి: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం ఎస్సీ, ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల జాక్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు బదులుగా మెరిట్ కం సీనియారిటీ విధానాన్ని వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. వరంగల్ రీజినల్ సెక్రటరీ శ్రీనివాస్, డివిజన్ ప్రెసిడెంట్ వెంకన్న, సూరిబాబు, కృష్ణ, దామోదర్, దయాకర్, రాజు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

వర్ధన్నపేట: వర్ధన్నపేట మండల ప్రత్యేకాధికారిగా పశుసంవర్ధక శాఖ సంచాలకుడు వెంకటేశ్వర్లు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ప్రత్యేకాధికారిగా పనిచేసిన వ్యవసాయశాఖ ఏడీ సురేశ్‌కుమార్ ఇటీవల బదిలీపై వెళ్లారు.

పోషకాహారంపై అవగాహన ఉండాలి

నల్లబెల్లి: పోషకాహారంపై తల్లులు సంపూర్ణ అవగాహనతో ఉండాలని నందిగామ పంచాయతీ కార్యదర్శి రాజు అన్నారు. పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నందిగామ, నారక్కపేట అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారాన్ని ప్రదర్శించారు. అంగన్‌వాడీ టీచర్లు వెంకటలక్ష్మి, శ్రీలత, రమాదేవి, శరణ్య పాల్గొన్నారు.

పాఠశాలల్లో బాలల పరిరక్షణ కమిటీలు

గీసుకొండ: సర్వోదయ సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో బాలల పరిరక్షణ కమిటీలను ఏర్పాటు చేసి వారి హక్కులకు భంగం కలుగకుండా అవగాహన కలిగిస్తామని సంస్థ ట్రైనింగ్ కోఆర్డినేటర్ ఇందిర అన్నారు. గురువారం గీసుకొండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 12 విద్యార్థులతో బాలల పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేశారు. ఇన్‌చార్జ్ హెచ్ఎం విటోభా, సర్వోదయ సంస్థ ఫీల్డ్ ఆఫీసర్ అక్తర్, వనిత, ఉపాధ్యయులు పాల్గొన్నారు.


హెచ్ఎం పోస్టులు మంజూరు చేయాలి

పర్వతగిరి: ప్రాథమిక పాఠశాలలకు హెచ్ఎం పోస్టులు మంజూరు చేసి, డీఈడీ, బీఈడీ అర్హత కలిగిన ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ డిమాండ్ చేశారు. మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడు జి.వెంకటేశ్వరు జిల్లా ఉపాధ్యక్షుడు భండుక ప్రసాద్, ఉమ్మడి జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి యు.అశోక్, పర్వతగిరి మండల నాయకులు సురేశ్, మల్లికార్జున్, రమేశ్, భిక్షపతి పాల్గొన్నారు.

శ్మశానవాటిక పరిస్థితిని కలెక్టర్‌కు నివేదిస్తాం

- జెడ్పీ సీఈఓ, ఇన్‌చార్జ్ డీపీఓ రాంరెడ్డి

సాక్షి ఎఫెక్ట్..



శ్మశానవాటికను పరిశీలిస్తున్న రాంరెడ్డి

సంగెం: మొండ్రాయి గ్రామంలోని శ్మశాన వాటికలో సౌకర్యాల లేమిపై కలెక్టర్‌కు నివేదిస్తామని జెడ్పీ సీఈఓ, ఇన్‌చార్జ్ డీపీఓ రాంరెడ్డి అన్నారు. మొండ్రాయి శ్మశానవాటికను గురువారం ఆయన సందర్శించారు. శ్మశానవాటిక బురదమయం, విద్యుత్ స్తంభాలు, దీపాలు లేకపోవడంతో .. అంతిమ మజిలీకి అన్ని సమస్యలే శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి స్పందించి డీపీఓ సందర్శించారు. గ్రామపంచాయతీకి 6 నెలలుగా నిధులు రావడం లేదని పంచాయతీ కార్యదర్శి అనిత తెలిపారు. శ్మశానవాటిక పరిస్థితిని కలెక్టర్‌కు నివేదిస్తానని ఆయన తెలిపారు. ఎంపీడీఓ రవీందర్ ఉన్నారు.